# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం 17 జూన్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ ఫలితాలను సోమవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య విడుదల చేశారు. మొదటి సంవత్సరంలో మొత్తం 2,49,358 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 1,68,079 మంది(67.4 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులు అయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 1,35,107 మంది పరీక్షలకు హాజరుకాగా, అందులో 68,665 మంది (50.82 శాతం )విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల కోసం https://tgbie.cgg.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైన వారిలో పరీక్షల్లో ఫెయిలైన వారితో పాటు ఫస్టియర్‌లో ఇంప్రూవ్‌మెంట్ కోసం రాసిన విద్యార్థులూ ఉన్నారు. రీ వ్యాల్యుయేషన్, రీ వెరిఫికేషన్ కోసం ఈ నెల 23వ తేదీలోగా ఫీజు చెల్లించాలని అధికారులు పేర్కొన్నారు. రీ కౌంటింగ్‌కు ఒక్కో పేపర్‌కు రూ.100, స్కాన్ చేసిన జవాబు పత్రాలు, రీ వెరిఫికేషన్ కోసం ఒక్కో పేపర్‌కు రూ.600 చెల్లించాలని తెలిపారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 22 నుంచి 29 వరకు నిర్వహించగా, ఈ పరీక్షలకు మొత్తం 4,13,880 మంది విద్యార్థులు హాజరయ్యారు.

# సెల్‌ఫోన్లు అప్పగించండి



- **విదేశీ కంపెనీకి డబ్బులు పంపడంపై కేటీఆర్‌కు ఏసీబీ సూటి ప్రశ్న**
- **18లోగా సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేయాలని ఆదేశం**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

ఫార్ములా-ఈ కారు రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావును ఏసీబీ అధికారులు సోమవారం ఎనిమిది గంటల పాటు విచారించారు. ఈ సందర్భంగా 2021 నుండి 2024 మధ్యకాలంలో ఉపయోగించిన సెల్‌ఫోన్లను జూన్ 18లోగా అప్పగించాలని ఏసీబీ ఆదేశించింది. కేటీఆర్ వద్ద సెల్‌ఫోన్ తీసుకురాలేదని చెప్పడంతో ఈ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.

ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోష్ నేతృత్వంలోని బృందం, గ్రీన్‌కో కంపెనీ, ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థల లావాదేవీలు, నిధుల బదిలీలు, నిబంధనల ఉల్లంఘనలపై వరుసగా ప్రశ్నలు సంధించింది. ఫార్ములా ఈ సంస్థ ఖాతాలకు రూ.45.71 కోట్లు బదిలీ చేయడం, బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో ఆ కంపెనీ తరపున వచ్చిన నిధులపై కూడా విచారణ సాగింది. ఈ కేసులో ఇప్పటికే వివిధ ఐఏఎస్ అధికారులు, హెచ్ఎండీఏ మాజీ ఇంజినీర్లు, ఫార్ములా ఈ ప్రతినిధుల స్టేట్మెంట్లు రికార్డు చేసిన ఏసీబీ, వాటిని ఆధారంగా తీసుకుని కేటీఆర్‌ను ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఏసీబీ అధికారులు ముందుగా డాక్యుమెంట్లను చూపించి ప్రశ్నలు సంధించారు. కేటీఆర్ సమాధానాలను వీడియో రికార్డ్ చేసినట్టు సమాచారం. కేటీఆర్ పై విచారణ పూర్తయిన అనంతరం, అవసరమైతే ఆయనను మరోసారి పిలిపిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.

విచారణ సందర్భంగా బంజారాహిల్స్ ఏసీబీ కార్యాలయానికి బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అయితే పోలీసుల బందోబస్తు నేపథ్యంలో వారిని కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్దే నిలిపివేశారు. కొంతమంది కార్యకర్తలు నీలోఫర్ కేఫ్‌లోకి వెళ్లటంతో పోలీసులు వారిని పంపించేందుకు యత్నించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది.

## తప్పు చేయలేదు.. తలదించుకునే పని చేయలేదు

- తెలంగాణ ప్రతిష్ట పెంచాను
- ఫార్ములా రేసు గురించి చర్చిద్దామంటే రేవంత్ రెడ్డి పారిపోయిండు
- పైసా అవినీతి లేని తుపేల్ కేసులో ఏసీబీతో విచారణ జరపడం దద్దమ్మ రాజకీయం
- లుచ్చా పని చేసి అడ్డంగా దొరికిన రేవంత్, బీఆర్ఎస్ నేతలను ఎలాగైనా జైలుకు పంపాలన్న శాడిస్ట్ ఆలోచనతో ఉన్నాడు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 2వ పేజీలో

# 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు

## రైతుల ఖాతాల్లో పడుతాయి

- 18 నెలల్లో రూ.లక్ష కోట్లు ఖర్చు చేశాం
- గత ప్రభుత్వం రైతులను మోసం చేసి.. ఇప్పుడు వీధినాటకాలు
- ఎవరెన్ని పన్నాగాలు పన్నినా మనదే ప్రభుత్వం
- సీఎం రేవంత్ రెడ్డి
- ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ 'రైతు నేస్తం'
- పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు
- ఆర్థిక శాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో రైతు భరోసా ప్రారంభం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

"ఈరోజు తెలంగాణ ప్రజలకు శుభదినం. వచ్చే 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో పడుతాయి.." అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని విశ్వసించి గడిచిన 18 నెలల కాలంలో వ్యవసాయ రంగంపై 1 లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖర్చు పెట్టామని వెల్లడించారు. గడిచిన పదేళ్లలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నమైన పరిస్థితుల నుంచి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ రైతులకు వ్యవసాయం దండగ కాదు.. పండుగ చేయాలన్న సంకల్పంతో పని చేస్తున్నామని చెప్పారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జరిగిన రైతు నేస్తం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర మంత్రులతోపాటు సీఎస్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్రంలోని 1600 రైతు వేదికల నుంచి సుమారు 6 లక్షల మంది రైతులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు సీఎంతో నేరుగా మాట్లాడే అవకాశం కల్పించారు.ఈ సందర్భంగా రైతు భరోసా నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి మాట్లాడారు.

రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఉచిత విద్యుత్, కనీస మద్దతు ధర, బోనస్ చెల్లింపు, రైతు బీమా వంటి రైతు సంక్షేమ కార్యక్రమాలపై గడిచిన 18 నెలల కాలంలో 1 లక్ష కోట్ల రూపాయలు వ్యవసాయం రంగంపై ఖర్చు పెట్టామన్నారు. ఈ విషయంలో పైసా పైసా లెక్క చెప్పడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించారు. "అధికారం చేపట్టే నాటికి లక్షల కోట్ల అప్పులు, ఎన్నో చిక్కుముళ్లు, ఎన్నెన్నో సమస్యలు. అడుగు వేయాలంటే చీకటి పరిస్థితి. అక్కడి నుంచి వెలుగు వైపు రాష్ట్ర ప్రభుత్వాన్ని, రైతాంగాన్ని నడిపించే ప్రయత్నం చేస్తున్నాం. రాష్ట్రంలో రైతులను చైతన్య పరిచి వాణిజ్య పంటలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయంలో అవసరమైన పనిముట్లను అందించి రైతులను ప్రోత్సహించాలి. రైతుల పెట్టుబడికి రెండింతలు లాభం వచ్చినప్పుడే తెలంగాణ రాష్ట్రం ఆర్థిక ప్రగతి సాధిస్తుంది.

పరిశ్రమలు పెట్టే వారికి సబ్సిడీలు, భూములు ఇచ్చినట్టే వ్యవసాయం చేసుకుంటున్న పేద రైతులకు సబ్సిడీలు, ప్రోత్సాహకాలతో పాటు వారికి టెక్నాలజీ బదిలీ చేయాల్సిన అవసరం ఉంది. వ్యవసాయానికి ఏటా 17 వేల కోట్ల రూపాయలు ఉచిత విద్యుత్ కోసం ఖర్చు చేస్తున్నాం. సోలార్ విద్యుత్ కు మారితే వ్యవసాయం ఉచితమే కాదు.. సోలార్ విద్యుత్ ద్వారా నెలకు రెండుమూడు వేల ఆదాయం ఆడబిడ్డలకు వచ్చే విధంగా ప్రణాళికలు చేస్తున్నారు. సోలార్ పంపు సెట్ల వల్ల ప్రయోజనాలను రైతులకు వివరించాల్సిన అవసరం ఉంది. ధరణిని అడ్డం పెట్టుకుని గత ప్రభుత్వం రైతులను ముప్పుతిప్పలు పెడితే, ప్రజా ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తెచ్చి రైతులకు అండగా నిలబడ్డాం. గ్రామ సభలు పెట్టి రైతుల సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నాం.

దేశంలో ఏ రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా తొలి ఏడాదిలో 60 వేల ఉద్యోగ నియామకాలు, మహిళల సాధికారత, ఎస్సీ వర్గీకరణ, సామాజిక న్యాయం వంటి ఎన్నో అంశాల్లో ముందుకు వెళ్లాం. ప్రతి శాఖను ప్రక్షాళన చేసుకుంటూ ముందుకు వెళుతున్నాం. చిన్న చిన్న తప్పులు ఎక్కడైనా దొర్లినా సరిదిద్దుకుంటూ ముందుకు తీసుకెళ్తున్నాం.

గత ప్రభుత్వం పదేండ్లు అధికారంలో ఉండి రెండు దఫాలుగా రైతులను మోసం చేసిందని ఆరోపించారు. రుణమాఫీ పేరుతో ఓట్లు దండుకుని గద్దెనెక్కి రైతులను మోసం చేసిందన్నారు. ప్రజాపాలనలో రైతు సంక్షేమాన్ని చూసి ఓర్వలేక.. వీధి నాటకాలతో బయలుదేరారని విమర్శించారు. పదేండ్ల పాలనలో నాటి ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చింది 'నెత్తిమీద అప్పు.. చేతిలో చిప్ప' అన్నారు. పదేండ్లలో చేసిన విధ్వంసం.. వందేండ్లు అయినా కోలుకోలేని పరిస్థితిలో ఉందన్నారు. సర్పంచ్‌లకు బిల్లులు, రిటైర్డ్ అయిన వారికి బెనిఫిట్స్, చివరికి విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. దీన్ని చక్కబెట్టడానికి రోజుకు 18గంటలు పనిచేసినా సరిపోవడం లేదన్నారు. వరి సాగు చేస్తే ఉరే అని గత పాలకులు చెబితే.. చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని ప్రజా ప్రభుత్వం చెబుతోందన్నారు. పేదలకు సన్న బియ్యం ఇచ్చేందుకు రైతులను సన్న వడ్లు పండించాలని ప్రోత్సహించామన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించి, రాష్ట్రంలో 60 శాతం పంట దిగుబడిని పెంచినట్టు తెలిపారు. రైతులు

మిగితా 2వ పేజీలో

## ప్రధాని మోడీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం



- **అవార్డును అందజేసిన సైప్రస్ అధ్యక్షుడు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సైప్రస్ అత్యున్నత పురస్కారాన్ని అందుకున్నారు. సోమవారం సైప్రస్‌లో అత్యున్నత పురస్కారం అయిన గ్రాండ్ క్రాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ మకారియోస్ IIIతో ప్రధాని మోడీని సత్కరించారు. సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ నుండి మోడీ ఈ అవార్డును అందుకున్నారు. ఈ గౌరవాన్ని పురస్కారాన్ని స్వీకరిస్తూ.. అవార్డును ఇరు దేశాల మధ్య స్నేహానికి అంకితం చేస్తున్నట్లు ప్రదాని మోడీ ప్రకటించారు. ఆర్డర్ ఆఫ్ మకారియోస్ III అనేది సైప్రస్ మొదటి అధ్యక్షుడు ఆర్చ్ బిషప్ మకారియోస్ III పేరు మీద ఉన్న దేశం సైప్రస్ అందించే సీనియర్ ఆర్డర్ ఆఫ్ నైట్‌హుడ్. కాగా, మూడు దేశాల పర్యటనలో భాగంగా ఈరోజు మోడీ సైప్రస్‌లో పర్యటిస్తున్నారు.

## మంత్రులతో సీఎం సమావేశం



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీరియస్‌గా దృష్టి సారించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు పూర్తయిన నేపథ్యంలో ఇప్పటిదాకా ఏయే శాఖల పనితీరెలా ఉందనే విషయమై ఆయన ఆయా మంత్రులతో సమాలోచనలు జరిపారు. ఒక్కో శాఖలో ఇప్పటి వరకూ చేసిన పనులేంటి? చెయ్యని పనులేంటి? ఇంకా చెయ్యాల్సిన అంశాలేమిటి..? అనే అంశాలను ముఖ్యమంత్రి... మంత్రులను అడిగి తెలుసుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ (సీసీసీ)తో సీఎం... అందుబాటులో ఉన్న మంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మంత్రుల పనితీరు, సంబంధం లేని శాఖల గురించి మాట్లాడటం, డిపార్టుమెంట్ల వారీగా ఇప్పటిదాకా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, వాటి అమలు, ఫలితాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, తాజాగా ఇదే అంశంపై మంత్రి పొంగులేటి వ్యాఖ్యలు తదితరాలు ఈ సమావేశంలో చర్చకొచ్చినట్టు తెలిసింది.

ఇక నుంచి శాఖల వారీగా ప్రతీనెలా నివేదికలివ్వాలంటూ ముఖ్యమంత్రి ఈ సందర్భంగా మంత్రులను ఆదేశించినట్టు తెలిసింది. ఆయా రిపోర్టులపై తాను వ్యక్తిగతంగా సమీక్ష చేస్తానంటూ సీఎం తెలిపారు. దాంతోపాటు ఏ శాఖకు ఆ శాఖకు విడిగానూ, అన్ని శాఖలపై ఉమ్మడిగానూ సమీక్షిద్దామంటూ సూచించారు. బలాలు, సానుకూలాంశాలతోపాటు బలహీనతలు, లోపాలుంటే వాటిపై కూడా చర్చించాలంటూ ముఖ్యమంత్రి కోరారు. తద్వారా పనితీరును మరింత మెరుగుపరచుకునేందుకు వీలు కలుగుతుందని సూచించారు. ఇటీవలే మంత్రివర్గ విస్తరణ చేపట్టిన నేపథ్యంలో సీనియర్లు... జూనియర్ల(కొత్త వారికి)కు దిశానిర్దేశం చేయాలంటూ ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లటంతోపాటు ప్రతిపక్షాల విమర్శలను అటు అసెంబ్లీలోనూ, ఇటు బయటా తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం శాఖల వారీగా తాజా సమాచారంతో సిద్ధంగా ఉండాలంటూ రేవంత్... మంత్రులకు సూచించారు. మరోవైపు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని భావిస్తున్న నేపథ్యంలో అందుకనుగుణంగా వ్యూహాలు రచించాలంటూ సీఎం... మంత్రులను కోరారు. ఏ జిల్లాకు ఆ జిల్లా, ఏ నియోజకవర్గానికి ఆ నియోజకవర్గం, ఏ మండలానికి ఆ మండలం వారీగా గెలుపు వ్యూహాలు రూపొందించాలని సూచించారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితరాంశాలు స్థానిక సమరంలో కీలకమవుతాయని చెప్పారు. అందువల్ల ప్రభుత్వం ఈ విషయంలో చేసిన కృషిని రైతులకు విడమరిచి చెప్పాలని ఆదేశించారు. దీంతోపాటు లోకల్ బాడీ ఎన్నికలకు సంబంధించి మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలు, దానిపై పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అభ్యంతరం వ్యక్తం చేయటం, మంత్రి సీతక్క స్పందించటం తదితరాంశాలపై సీఎం, అమాత్యులతో మాట్లాడినట్టు తెలిసింది. ఈ సందర్భంగా ఆయన పొంగులేటిని సున్నితంగా మందలించినట్టు వినికిడి. ఇలాంటి విషయాల్లో జాగ్రత్తగా ఉండాలంటూ ముఖ్యమంత్రి, మంత్రులకు సూచించారు. 'ఎవరి శాఖలకు సంబంధించి వారే మాట్లాడండి, ఒకరి శాఖలో మరొకరి జోక్యం వద్దు, విధానపరమైన నిర్ణయాల విషయంలో ఎక్కడ పడితే అక్కడ, ఎవరు పడితే వారు మాట్లాడొద్దు...' అంటూ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ గతంలో చేసిన హెచ్చరికను ఈ సందర్భంగా సీఎం మరోసారి గుర్తు చేశారు.

## రైతు పండించే ప్రతి ఎకరాకు రైతు భరోసా



- **డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రానున్న తొమ్మిది రోజుల వ్యవధిలోనే రాష్ట్రంలోని అన్నదాతల అందరి ఖాతాల్లోకి రైతు భరోసా డబ్బులు మొత్తం జమ చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈరోజు (సోమవారం) రాజేంద్రనగర్ లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన రైతు నేస్తం' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. రైతు నేస్తం సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక బటన్ నొక్కగానే రైతు ఖాతాల్లోకి టింగ్ టింగ్ మంటూ రైతు భరోసా నిధులు జమ అవుతాయని డిప్యూటీ సీఎం వివరించారు. రాష్ట్ర చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మక నిర్ణయం అని అన్నారు. రాష్ట్రంలోని సాగు యోగ్యమైన, రైతన్నలు సాగు చేసుకుంటున్న ప్రతి ఎకరాకు రైతు భరోసా మంజూరు చేస్తున్నట్టు తెలిపారు.

ఎన్ని ఎకరాలు సాగు చేస్తే ఆ మొత్తం ఎకరాలకు రైతు భరోసా నిధులు జమ అవుతాయి, ఎలాంటి లిమిట్ లేదు అన్నారు. రాష్ట్రంలో సాగులో ఉన్న 1.49 కోట్ల పైబడి ఎకరాలకు ఎకరాకు 12 వేల చొప్పున రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ అవుతాయి అన్నారు. భూమిలేని నిరుపేదలు వారు వ్యవసాయ కూలీలుగా ఉంటూ రైతుల పక్షాన నిలబడుతున్న పేదలకు కుటుంబానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 12,000 చొప్పున ప్రజా ప్రభుత్వం చెల్లిస్తుంది అన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రూపాయి, రూపాయి పోగుచేసి రైతులు, రాష్ట్ర ప్రజల పక్షాన సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తుంది అన్నారు. రైతుల కోసం ప్రజా ప్రభుత్వం ప్రతి సంవత్సరం 70 వేల కోట్లు చొప్పున ఐదు సంవత్సరాలలో మొత్తం 3.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు.ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇలా ఒకటి తర్వాత ఒకటి సంక్షేమ పథకాలు అమలు చేసుకుంటూ పోతే ఇక మాకు పుట్టగతులు ఉండవని పదేళ్లు పాలించిన వారు ప్రజా ప్రభుత్వం పై బురదజల్లే కార్యక్రమాన్ని చేపట్టిన విషయం రాష్ట్ర ప్రజలు గుర్తించాలి అన్నారు. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ రైతుల

మిగితా 2వ పేజీలో


## తెలంగాణకు మరో 7 కొత్త నవోదయ విద్యాలయాలు

- భద్రాద్రి, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఏర్పాటు
- అధికారిక ఉత్తర్వులు జారీ
- మొత్తం నవోదయాల సంఖ్య 16కు పెరుగుదల

వివరాలు 2వ పేజీలో

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులివ్వొద్దు

- **మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్ర ఆర్థిక, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపడుతున్న గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణానికి పర్యావరణ అనుమతులు ఇవ్వొద్దని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు లేఖ రాశారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని, గోదావరి నదీ జలాల వినియోగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజల హక్కులను కాపాడేందుకు ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని ఆయన కేంద్రాన్ని కోరారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన లేఖలో, ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జలసంఘం నుంచి ఎలాంటి అనుమతులు లభించలేదని స్పష్టం చేశారు. గోదావరి ట్రైబ్యునల్ నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలు ఉన్నాయని, దీనిని అనుమతించడం ద్వారా తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని హెచ్చరించారు. రేపటి ఎన్విరాన్‌మెంటల్ అప్రైజల్ కమిటీ సమావేశంలో ఏపీ ప్రతిపాదనలను తిరస్కరించాలని ఆయన గట్టిగా విజ్ఞప్తి చేశారు.

ఈ ప్రాజెక్టు నిర్మాణం గోదావరి నదీ జలాల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య సున్నితమైన సమస్యలను మరింత జటిలం చేసే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీసుకున్న ఈ చొరవ, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఎంతటి దృఢ సంకల్పంతో ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఈ లేఖతో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వల్ప అస్వస్థత

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**



మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సోమవారం సాయంత్రం సమయంలో తెలంగాణ భవన్‌లో హరీశ్ రావు అస్వస్థతకు లోనయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఏసీబీ విచారణకు హాజరై వచ్చిన తర్వాత నిర్వహించిన సమావేశంలో హరీశ్‌రావు స్వల్పపాటి అస్వస్థతకు గురి కావడంతో ఆయన్ను అక్కడ నుంచి బేగంపేట కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. హై ఫీవర్‌తో హరీశ్‌రావు ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఫీవర్, డి ఐడ్రేషన్‌తో బాధ పడుతున్న మాజీ మంత్రి హరీశ్ రావు.. ఉదయం నుంచి తెలంగాణ భవన్‌లోనే ఉన్నారు.సాయంత్రం 7 గంటలకు బేగంపేట్ కిమ్స్ ఆసుపత్రిలో హరీశ్‌రావును జాయిన్ చేయగా, ఆయన్ను కేటీఆర్, ఇతర బిఆర్ఎస్ నాయకులు పరామర్శించారు.

## 42 వెటర్నరీ మెడికల్ షాపులకు నోటీసులు జారీ

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వెటర్నరీ మెడికల్ షాపులు, పెట్ క్లినిక్స్, వెటర్నరీ దవాఖానాలపై సోమవారం జరిగిన తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనలపై తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ చర్యలు చేపట్టింది. మొత్తం 42 వెటర్నరీ సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ తనిఖీల్లో పలు శాకాహార, మాంసాహార ఉత్పత్తుల్లో ఉపయోగించే జంతువులపై అనధికారికంగా యాంటిబయోటిక్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు. వెల్లడించినట్లుగా డీసీఏ డైరెక్టర్ జనరల్ షహ్నవాజ్ ఖాసిం తెలిపారు.

## జనగణనకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో 16 ఏళ్ల తర్వాత చేపట్టనున్న జనగణనపై కేంద్ర హోంశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈసారి జనగణనతో పాటే కులగణన కూడా కేంద్రం చేపట్టనుంది. దేశ 16వ జన గణనను 2027 ఫిబ్రవరిలో చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం రెండు దశల్లో జరగనున్న జనగణన 2027 మార్చి 1 నాటికి పూర్తి అవుతుందని నోటిఫికేషన్‌లో పేర్కొంది. జనగణనతో పాటు కుల గణననూ కూడా అదే సమయానికి పూర్తి చేయనుంది. ఇందుకోసం 2027 మార్చి 1ని రెఫరెన్స్ తేదీగా నిర్ణయించింది. అంటే ముందు రోజైన ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి 12 గంటల కల్లా జన గణన పూర్తి కానుంది. అంతకుముందే 2026 ఏప్రిల్‌లోనే తొలి విడత హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానుంది. మంచు ప్రభావిత ప్రాంతాలైన లద్దాఖ్, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో 2026 సెప్టెంబరు ఆఖరు నాటికే జన గణన పూర్తి కానుంది. ఈ ప్రాంతాలకు 2026 అక్టోబరు 1ని రెఫరెన్స్ తేదీగా ప్రకటించింది.

జన గణన కోసం మొత్తం 34 లక్షల మంది గణకులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పని చేస్తారు. ఈసారి జనాభా లెక్కల సేకరణ అంతా ట్యాబ్‌ల ద్వారా పూర్తిగా డిజిటల్ రూపంలోనే సాగుతుంది. ప్రభుత్వం వెల్లడించే పోర్టళ్లు, యాప్‌లలో ప్రజలు సొంతంగానే తమ వివరాలను నమోదు చేసే వెసులుబాటు కూడా ఉంది. డేటా భద్రత కోసం కఠినమైన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర హోంశాఖ తెలిపింది. సమాచారణ సేకరణ, బదిలీ, స్టోరేజీని అత్యంత కట్టుదిట్టంగా చేపడుతున్నట్లు పేర్కొంది.

జనాభా లెక్కల సన్నాహాలను సమీక్షించేందుకు జూన్ 15న ఢిల్లీలో జరిగిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన సమావేశం జరిగింది. అందులో కేంద్ర హోం కార్యదర్శి, రిజిస్ట్రార్ జనరల్, భారత్ జనాభా లెక్కల కమిషన్(ఆర్జీ, సీసీఐ), ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. జూన్ 16న జనగణన గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల అవుతుందని ఆ సమావేశంలో అప్పుడే చెప్పారు. ఇప్పుడు నోటిఫికేషన్ విడుదలైంది.

# వైద్య కళాశాలల పనులపై కార్యాచరణ ప్రణాళిక

- కళాశాలల్లో క్షేత్ర స్థాయి పరిశీలనకు అధికారులతో కమిటీ
- మూడేళ్లలో అన్ని కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో ఉండాలి
- వైద్యారోగ్య సమీక్షలో

**ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి**



**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పని చేయాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారు చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి అక్కడ ఏం అవసరాలు ఉన్నాయి... ఎంత మేర నిధులు కావాలి.. తక్షణమే పూర్తి చేయాల్సిన పనులు... ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయం తదితర వివరాలతో నివేదికను సమర్పించాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఐసీసీసీలో సోమవారం ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నియామకాలు, బోధన సిబ్బందికి ప్రమోషన్లు, వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో పడకల పెంపు, ఆయా కళాశాలలకు అవసరమైన వైద్య పరికరాలు, ఖాళీల భర్తీ వీటన్నింటిపై సమగ్ర నివేదిక రూపొందించి అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలుంటే వెంటనే తెలియజేయాలని, కేంద్ర మంత్రి నడ్డా, ఆ శాఖ అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరిస్తామని సీఎం పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ (జపాన్ భాష) ను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో మనకు మద్దతు ఇచ్చేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, ఆసుపత్రుల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. విద్యా, వైద్య రంగాలు ఎంతో కీలకమని, ప్రతి నెలా మూడో వారంలో ఈ రెండు శాఖలపై సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ, వైద్యారోగ్య శాఖ డైరెక్టరేట్ డాక్టర్ నరేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పు చేయలేదు.. తలదించుకునే పనిచేయలేదు



**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ప్రతిష్టను ఆకాశమంత ఎత్తుకు తీసుకుపోయే పని చేశానే కాని తాను ఎలాంటి తప్పు, తలదించుకునే పని చేయలేదన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు. నాలుగు గోడల మధ్య కాదు నాలుగు కోట్ల మంది ముందు ఫార్ములా ఈ రేసు గురించి అసెంబ్లీలో చర్చిద్దామంటే రేవంత్ రెడ్డి పారిపోయిండని విమర్శించారు. ఏసీబీ విచారణ తరువాత తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్, దేశంలో ఏ రాజకీయ నాయకుడు సాహసించని లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమని తానంటే రావడానికి రేవంత్ రెడ్డికి ధైర్యం లేదని ఎద్దేవా చేశారు. మొదటి సంవత్సరం ఫార్ములా రేసు విజయవంతం కావడంతో రెండవ సంవత్సరం కూడా ఎలాగైనా హైదరాబాద్ లోనే నిర్వహించాలని బీఆర్ఎస్ ప్రభుత్వం విధానపర నిర్ణయం తీసుకుందని అందులో భాగంగానే, నిర్వహణ సంస్థ బ్యాంకు ఖాతాకు డబ్బులు పంపించిన విషయాన్ని ఏసీబీ అధికారులకు వివరించానని తెలిపారు. ఇందులో అవినీతి ఎక్కడ ఉందని తాను అధికారులను ప్రశ్నిస్తే వారి దగ్గరి నుంచి ఎలాంటి సమాధానం రాలేదన్నారు. అసలు కరప్షనే జరగని ఓ తుపేల్ కేసులో ఏసీబీని ఇన్వాల్వ్ చేయడాన్ని తన 26 సంవత్సరాల కెరీర్ లో చూడనే లేదని మాజీ ఐపిఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. చిట్టినాయుడు రాసిచ్చిన పనికిమాలిన ప్రశ్నలనే పొద్దుటి నుంచి అటుతిప్పి ఇటు తిప్పి ఏసీబీ అధికారులు అడిగారని చెప్పారు. ఒకవేళ ప్రభుత్వ పెద్దల నుంచి అరెస్ట్ చెయ్యాలని ఒత్తిడి ఉంటే బేషుగ్గా చేసుకోవచ్చని అధికారులకు చెప్పానన్న కేటీఆర్, అవసరమైతే తెలంగాణ కోసం మరోసారి జైలుకు వెళ్లడానికి కూడా సిద్ధమన్నారు. రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడేవారు ఎవరూ బీఆర్ఎస్ లో లేరన్నారు కేటీఆర్.

50 లక్షల డబ్బుల బ్యాగుతో లుచ్చా పని చేసి అడ్డంగా దొరికి నెల రోజులు జైల్లో ఉన్న రేవంత్ రెడ్డి, తమను కూడా ఏదో ఒక కేసులో ఇరికించి జైలుకు పంపాలన్న శాడిస్ట్ ఆలోచనతో ఉన్నాడని కేటీఆర్ తెలిపారు. అందులో భాగంగానే తెలంగాణ సాధించిన కేసీఆర్ ను, మాజీ మంత్రి హరీశ్ రావును కాళేశ్వరం కమిషన్ ముందుకు,తనను ఏసీబీ విచారణకు పిలుస్తున్నాడని చెప్పారు. అయితే ఇవన్నీ లొట్టపీసు కేసులు రేవంత్ రెడ్డి ఓ లొట్ట పీస్ ముఖ్యమంత్రి అన్న కేటీఆర్, కాంగ్రెస్ నేతలకు పరిపాలన చేతకాదు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దమ్ము లేదని విమర్శించారు. దద్దమ్మ రాజకీయాలతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. అక్రమ కేసుల్లో తమకు నోటీసులు రావడం పాత చింతకాయ పచ్చడిలా మారిందన్న కేటీఆర్, బీఆర్ఎస్ కేడర్ వీటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పెడితే ఒక 15 రోజులు తనను జైల్లో పెట్టి రేవంత్ రెడ్డి పైశాచికానందం పొందడం తప్ప ఇంకేం చేయలేడన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యుండి జై తెలంగాణ అనకపోతే, తెలంగాణ రాష్ట్రాన్ని ప్రతిరోజు కించపరిస్తే, తెలంగాణ రాష్ట్రాన్ని దివాలా రాష్ట్రం అని అంటే,ఢిల్లీకి పోతే అపాయింట్మెంట్ ఇస్తలేరు దొంగను చూసినట్టు చూస్తున్నారంటే బరాబర్ రేవంత్ రెడ్డిని హౌలా అనే అంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

2019 జూన్ 21 నాడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ఆరు సంవత్సరాలు అవుతున్న సందర్భంగా కాళేశ్వరం గొప్పదనాన్ని ప్రజలకు తెలియచేయడానికి రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిగీసి కాంగ్రెస్ పార్టీ నాయకులను ఫుట్బాల్ ఆడి చిత్తుచిత్తుగా ఓడించడం మీద బీఆర్ఎస్ నాయకులు దృష్టి పెట్టాలన్నారు కేటీఆర్. పొద్దుటి నుంచి ఓపికగా తనకోసం ఎదురు చూసినఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,పార్టీ కార్యకర్తలు,నాయకులకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా హరీష్ రావు గారు మాట్లాడుతూ .. రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను, చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న కేటీఆర్ గారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. రేవంత్ రెడ్డి 18 నెలల పాలనలో కేటీఆర్ పై 14 కేసులు పెట్టాడు. రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. మాట తప్పినందుకు రేవంత్ రెడ్డిపై కేసు పెట్టాలి. దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి మాట తప్పిన నిన్ను ఏం చేయాలి రేవంత్ రెడ్డి.. కేటీఆర్ గారు ఈ రాష్ట్ర గౌరవాన్ని పెంచే విధంగా, భారతదేశంలో అనేక రాష్ట్రాలు ఈ ఫార్ములా రేసింగ్ కోసం పోటీపడుతుంటే తన శక్తి యుక్తులను ఉపయోగించి హైదరాబాద్కు ఫార్ములా ఈ రేసును తీసుకువచ్చారు. రేవంత్ రెడ్డి మాత్రం ఏ రాష్ట్రం కూడా అందాల పోటీలు నిర్వహించమని తేల్చి చెబితే తెలంగాణలో నిర్వహించి ఈ దేశ పరువు, రాష్ట్ర పరువు తీశాడు. అందరూ కావాలన్న ఈ కార్ రేసింగ్ను తెచ్చి రాష్ట్ర గౌరవం పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వం. ఎవరూ ముందుకు రాని అందాల పోటీలు నిర్వహించి పరువు తీసింది రేవంత్ రెడ్డి. స్థానిక సంస్థల ఎన్నికలకు పోవాలి కాబట్టి కేటీఆర్ పై తప్పుడు కేసులు పెట్టి చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారు. రేవంత్ రెడ్డి పాలనలో తుమ్మినా, దగ్గినా కేసులు పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కమీషన్లను ఎత్తిచూపితే కేసులు, లఘుచర్ల రైతులకు బేడీలేస్తే కేసులు, ప్రశ్నిస్తే కేసులు. ఎన్ని కేసులు పెట్టినా కేటీఆర్ ఒక వ్యక్తి కాదు శక్తి. లక్షలాది మంది బీఆర్ఎస్ కార్యకర్తలు, కుటుంబ సభ్యుల అండ ఉన్న కేటీఆర్ ని ముట్టుకుంటే భస్మం అయిపోతారు తస్మాత్ జాగ్రత్త అన్నారు.

## తెలంగాణకు మరో 7 కొత్త నవోదయ విద్యాలయాలు

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి కొత్తగా మరో ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలను (జేఎన్వీ) మంజూరు చేసింది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను సోమవారం జారీ చేసింది. గత ఏడాది డిసెంబర్‌లోనే ఈ కొత్త విద్యాలయాల ఏర్పాటుకు సూత్రప్రాయంగా ఆమోదం లభించినప్పటికీ, ఇప్పుడు పరిపాలనాపరమైన అనుమతులు ఖరారయ్యాయి. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో నాణ్యమైన విద్య మరింత మంది విద్యార్థులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల వారికి అందుబాటులోకి రానుంది.

కేంద్రం తాజాగా మంజూరు చేసిన ఏడు నవోదయ విద్యాలయాలను భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, మహబూబ్‌నగర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నిజామాబాద్, సంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం తెలంగాణలో కరీంనగర్, కుమురంభీం ఆసిఫాబాద్, నాగర్‌కర్నూల్, నల్గొండ, కామారెడ్డి, వరంగల్, రంగారెడ్డి, సిద్దిపేట, ఖమ్మం జిల్లాల్లో కలిపి మొత్తం 9 నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. ఈ కొత్త వాటితో కలిపి రాష్ట్రంలో జేఎన్వీల సంఖ్య 16కు చేరుతుంది.

## 9 రోజుల్లో రూ. 9 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

పండించిన సన్న వడ్లతోనే ఈ రోజు పేదలకు సన్నబియ్యం అందిస్తున్నట్టు స్పష్టం చేశారు. వరి పండించడంలో ఆంధ్రప్రదేశ్, పంజాబ్, హర్యానాను దాటి తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచిందన్నారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలపై రూ.8 లక్షలా 20 వేల కోట్ల అప్పు మోపిపోయిందని సీఎం అన్నారు. అప్పుల కుప్పల నుంచి గట్టెక్కేందుకు తలపానం తోకకు వస్తోందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతులకు 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా అందించేందుకే ఇక్కడికి వచ్చామన్నారు. రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నుంచి ఆత్మ గౌరవంతో బతికే పరిస్థితి కల్పించామన్నారు. ఈ విషయంపై ఏ గ్రామంలోనైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ప్రజల, రైతుల, నిరుద్యోగుల చావుల పునాదులపై అధికారంలోకి రావాలని ప్రతిపక్షం దురాలోచన చేస్తోందన్నారు. భార్యాభర్తలు మాట్లాడుకున్నా ఫోన్ ట్యాపింగ్ చేసిన పరిస్థితి గత ప్రభుత్వంలో ఉండేదన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ కల్పించామన్నారు. ప్రజలకు కావాల్సింది ఇదే కదా అని అన్నారు. ఎవరెన్ని ధర్నాలు చేసినా, బట్టలు చించుకున్నా పదేండ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. 'మీ పని చేసిపెట్టే బాధ్యత నాది.. మీరు వారి పని పట్టండి' అని సీఎం రైతులకు పిలుపునిచ్చారు. అనంతరం వానాకాలం సీజన్ పంట సాగు పెట్టుబడి సాయంలో భాగంగా రాష్ట్ర ఆర్థికశాఖ కార్యదర్శి సుల్తానీయ ఆధ్వర్యంలో సీఎం బటన్ నొక్కి రైతు భరోసాను ప్రారంభించారు. 7 రోజుల్లో రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ కానుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, మార్కెటింగ్ కమిటీ చైర్మెన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రైతు పండించే ప్రతి ఎకరాకు రైతు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

కోసం ఈ ప్రభుత్వం నిటారుగా నిలబడింది అన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు అరచేతిలో పెట్టుకొని ఆశీర్వదించి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. సహకారాలు అందిస్తుంటే బీఆర్ఎస్ నేతలు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటున్నారు.. వారు దయ్యాలు అని ఆ పార్టీ నేతలే చెప్పారు, ఆ దయ్యాలు నేడు వికట్టహాసం చేస్తున్నాయి, దయ్యాలు ఊర్లో ఉంటే అరిష్టం ఆ దయ్యాలను ఊరి పొలిమేరలోకి రానివ్వకుండా తరిమికొట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రైతులు సుభిక్షంగా ఉండాలి పంటలు పచ్చగా పండాలి రైతన్నలు ఆనందంగా ఉండేందుకు రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ఈ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుంది అని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాత ప్రభుత్వం అన్నారు. రైతులు అంటేనే కాంగ్రెస్.. కాంగ్రెస్ అంటేనే రైతులు అని డిప్యూటీ సీఎం తెలిపారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలకు విడదీయరాని అనుబంధం ఉంది అని అన్నారు. ఉచిత కరెంటు, రుణమాఫీ, పంటలకు మద్దతు ధర, మద్దతు ధరకు తో పాటు సన్నధాన్యం సాగు చేసిన రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. ఎవరు ఊహించని విధంగా గత ప్రభుత్వాలు తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు ఏ ఒక్కటి ఆపకుండా రైతు సోదరుల కోసం అనేక కొత్త పథకాలు అమలు చేస్తున్నాం అన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నాలుగు నెలల వ్యవధిలోనే రైతు రుణమాఫీ కింద 21 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసాం అన్నారు. ఇంతటి గొప్ప సాహసం భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగలేదు అన్నారు. గత పాలకులు వెళ్లేముందు రైతు భరోసా వదిలేసి వెళ్లిపోతే క్యాబినెట్లో తీర్మానం చేసి రైతు భరోసా కింద 13,088 కోట్లు జమ చేసాం అన్నారు. సన్నధాన్యం సాగుచేసిన రైతులకు క్వింటాకు 500 చొప్పున బోనస్ కింద 1,199 కోట్లు విడుదల చేసాం అని తెలిపారు.బీఆర్ఎస్ నేతలు రైతుల భీమా గురించి మర్చిపోయారు, ఆ రాడు రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా పంట నష్టం జరిగితే రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసిన పట్టించుకోలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎప్పుడైనా పంట నష్టం జరిగితే లెక్క గట్టి రైతుల ఖాతాల్లో జమ చేశారు, కానీ 10 సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ నేతలు ఆలోచన చేయలేదని డిప్యూటీ సీఎం విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పంట నష్టం కింద 260 కోట్లు విడుదల చేశాం, రైతుల ఇన్సూరెన్స్ కోసం 2,181 కోట్లు ఖర్చు చేసిన ట్టు తెలిపారు. రైతులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు రాష్ట్రంలోని 29 లక్షల పంపుసెట్లకు ఉచితంగా 24 గంటల కరెంటు సరఫరాకు 16,691 కోట్లు రైతుల పక్షాన ఆర్థిక శాఖ నుంచి విద్యుత్ శాఖ అధికారులకు చెల్లింపులు చేస్తుందని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు 11 వేల కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు.

## రేపటి నుంచి సెప్టెంబర్ నెల కోటా తిరుమల శ్రీవారి దర్శనం టికెట్లు

**బలగం టీవి, హైదరాబాద్**

సెప్టెంబర్ నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి దర్శనం, గదుల కోటా విడుదల తేదీల వివరాలను టీటీడీ వెల్లడించింది. శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లను జూన్ 18న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఇ-సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జూన్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఇ-సేవా టికెట్లు పొందిన భక్తులు జూన్ 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు డబ్బు చెల్లిస్తే లక్కీడిప్ టికెట్ మంజూరు అవుతుంది. జూన్ 21న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్లు, జూన్ 21న మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటా టికెట్లు విడుదలవుతాయి.జూన్ 23న ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్లు, 23 ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు ఆన్‌లైన్ కోటా టికెట్లు, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి ఉచిత ప్రత్యేక దర్శన టికెట్లు విడుదల అవుతాయి. జూన్ 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు, 24 న మధ్యాహ్నం 3 గంటలకు తిరుపతి, తిరుమలలో గదుల బుకింగ్ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు.

# భూ నిర్వాసితుల త్యాగాన్ని ఎట్టి పరిస్థితుల్లో మరువం..

**- నేడు ప్రజా ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి..**
**- వేములవాడ ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తామని**
**- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**



**బలగం టీవీ, వేములవాడ**

భూ నిర్వాసితుల త్యాగాన్ని ఎట్టి పరిస్థితుల్లో మరువబోమని,రోడ్డు వెడల్పు లో భూములు కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వడం జరుగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.వేములవాడ పట్టణంలో సోమవారం ఏర్పాటు విలేకర్ల సమావేశం లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడ రాజన్న సన్నిధిలో అభివృద్ధికి శ్రీకారం చుట్టడం జరిగిందని,ఆదివారం నుండి పట్టణంలో ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న రోడ్డు వెడల్పు పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. నవంబర్ 20న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 8 మంత్రుల సమక్షంలో 76 కోట్లతో ఆలయ విస్తరణ,47 కోట్లతో రోడ్డు వెడల్పు కోసం, 35 కోట్లతో అన్న సత్ర నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందని అన్నారు.2024-25 ఆర్థిక సంవత్సరంలో 50 కోట్లు, 25-26 బడ్జెట్లో 100 కోట్లు రాజన్న ఆలయ, పట్టణ అభివృద్ధికి నిధులు కేటాయించడం జరిగిందని అన్నారు.

ఆలయ అభివృద్ధి,పట్టణ అభివృద్ధి సమాంతరంగా చేస్తున్నామని,పెరుగుతున్న పట్టణ జనాభా కు అనుగుణంగా పట్టణ అభివృద్ధి చేస్తామని,30 సంవత్సరాలుగా ప్రజలు కోరుకుంటున్న రోడ్డు వెడల్పు, ఆలయ అభివృద్ధి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ముందుకు తీసుకుపోతున్నామని,గత ప్రభుత్వం లాగా కేవలం శంకుస్థాపనలకు పరిమితం కాకుండా పనులు ప్రారంభం చేస్తున్నామని అన్నారు.

వేములవాడ ఆలయాన్ని 4 ఎకరాల్లో విస్తరణ చేయడం కోసం శృంగేరి పీఠనికి 4 సార్లు వెళ్లి వారి సూచనలు సలహాలు తీసుకొని ఆలయ అభివృద్ధి పై ముందుకు పోతున్నామని, భవిష్యత్తులో కూడా రాజన్న ఆలయ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తామని అన్నారు. మన రాష్ట్రం నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన వసతులు శీఘ్రదర్శనం కలిగేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. కేసీఆర్ గతంలో రాజన్న ఆలయ తంతేల మీద ఇచ్చిన మాట తప్పడు అని,కేసీఆర్ నా లగ్గం ఇక్కడే అయ్యింది అని, నా అత్తగారు కోదురుపాక అని ప్రజలను మభ్యపెట్టి తక్షణమే 100 కోట్లు విడుదల చేస్తానని హామీ ఇచ్చి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో ప్రస్తుతం కూడా అలానే ఉందని,ఒక్క ఇటుక తీసి పెట్టలేదు, కానీ రంగురంగుల బ్రోచర్లలో మాత్రమే అభివృద్ధి చూపెట్టార ని అన్నారు.భక్తులకు పట్టణ వాసులకు ఇబ్బంది తలెత్తకుండా ముందుకు పోతున్నామని, అనాడు పిసిసి అధ్యక్షుడుగా రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటలకు నేడు అడుగులు పడుతున్నాయని, భవిష్యత్తులో మన ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తీసుకెళ్తా అని అన్నారు.

# కమ్యూనిస్టు విలువలు, సోషలిస్టు భావాలు విస్తృత పరచాలి..




**-సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కొనసాగుతుందని తద్వారా పేదరికం నిరుద్యోగం, దారిద్యం ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, వీటికి వ్యతిరేకంగా ఎర్రజెండా పోరాడుతున్నదని భవిష్యత్తు ఎర్రజెండాదేనని నేటి యువతరం కమ్యూనిస్టు విలువలు సోషలిస్టు భావాలను అలవర్చుకోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు అన్నారు. సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమ భవన్ లో జరుగుచున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతుల్లోబాగంగా సోమవారం కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కర్తవ్యాలు అనే అంశం పై సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ ఎర్రజెండా పని అయిపోయిందని సోషలిజం ఇక లేదని ఇజాలకు కాలం చెల్లిందని అనే మాట పాతదని ఈ కాలంలో మళ్ళీ కమ్యూనిజం ఆలోచనలు, సోషలిజం భావాలు కమ్యూనిస్టు భావాలు క్రమక్రమంగా ప్రపంచంలో పెరుగుతున్నాయని, ఇటీవల పరిణామాలు రుజువు చేస్తున్నాయని అన్నారు. సోషలిస్టు దేశాలుగా ఉన్న చైనా, క్యూబా, వియత్నాం, ఉత్తర కొరియా, లావోస్ దేశాలు అమెరికన్ సామ్రాజ్యవాదం యొక్క ఒత్తిళ్లకు తలొగ్గకుండా దీటుగా నిలబడి పోరాడుతున్నాయన్నారు. చైనా అమెరికాను మించిపోతుందని అమెరికా బెంబేలు ఎత్తుతున్నదని అన్నారు. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలు ప్రపంచమంతా ఆర్థిక అసమానతలు పెంచాయని వాటికి వ్యతిరేకంగా ప్రతిఘటన అదే తీరులో ఉన్నదని అమెరికా కు ప్రతిఘటన సాగుతుందని అన్నారు. నయా ఉదారవాద విధానాలకు, హిందుత్వ మతోన్మాదానికి ,ప్రజాస్వామ్యంపై, నిరంకుశ దాడులకు వ్యతిరేకంగా సిపిఎం పెద్ద ఎత్తున ప్రచార ఉద్యమాలకు సిద్ధం కావాలని పోరాటాలను ఉధృతంగా సాగించాలన్నారు. ప్రజాస్వామ్యం, ప్రజాస్వామిక హక్కులు, పౌరహక్కుల రక్షణకు అనుకూలంగా పార్టీ ఉద్యమించిందని,

రాజ్యాంగబద్ధ సంస్థలను దెబ్బతీయడానికి వ్యతిరేకంగా విశాల ఐక్యతను నిర్మించడానికి సీపీఎం కృషి చేస్తుందన్నారు. మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీ మతస్తుల హక్కుల రక్షణలో, సిపిఎం మెనగాడిలా నిలబడుతుందన్నారు. మోడీ ప్రభుత్వం అమెరికా అనుకూల విదేశాంగ విధానాన్ని అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ , సామ్రాజ్యవాదం వ్యతిరేక చైతన్యాన్ని పెంపొందించడానికి సిపిఎం కృషి చేస్తుందన్నారు కేరళలోని ఎల్ డి ఎఫ్ ప్రభుత్వ రక్షణ కోసం పార్టీ నిలబడి ఆ ప్రభుత్వం చేపడుతున్న ప్రజానుకూల విధానాల అమలు బలపరచాలన్నారు. వామపక్ష, ప్రజాతంత్ర సంఘటన నిర్మాణం కోసం పార్టీ కృషి చేస్తుందని అన్నారు.ఈ తరగతులకు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మళ్లారపు అరుణ్ కుమార్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు.ఇక్కడ సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల కోడం రమణ జిల్లా కమిటీ సభ్యులు ఎరవెల్లి నాగరాజు, సూరం పద్మ గురజాల శ్రీధర్, మళ్లారపు ప్రశాంత్,శ్రీరాముల రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# రైతు నేస్తం కార్యక్రమం..

**బలగం టీవీ, బోయినిపల్లి:**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా రైతు నేస్తం కార్యక్రమాన్ని 1031 రైతు వేధికలకు వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం మరియు ప్రారంభోత్సవం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో ఇది వరకు కోదురుపాకలో వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ ఉండేది, నూతనంగా బోయినిపల్లి, విలాసాగర్ రైతువేధికలలో కూడా వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ లను ఏర్పాటు చేశారు. అట్టి 3 రైతువేధికలలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం అనుసంధాన కార్యక్రమాన్ని రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ నుండి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎం.సి చైర్మన్ బోయిని ఎల్లేష్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, పీఏసీఎస్ నర్సింగాపూర్ చైర్మన్ ముదిగంటి సురేందర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారిని ప్రణీత, జిల్లా వ్యవసాయ కార్యాలయ అధికారి కవిత, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీంరెడ్డి మహేశ్వర్ రెడ్డి, ఎ.ఎం.సి డైరెక్టర్లు, మాజీ ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి, మండల ఎ.ఎస్.ఓ పరమేష్, ఎ.ఇ.ఓ లు శ్రీదేవి, రవళి, రజిత, లక్ష్మణ్, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యువకుడి హత్య కేసులో ఇద్దరు అరెస్ట్..

**బలగం టీవీ, గంభీరావుపేట**

లింగన్నపేట గ్రామానికి చెందిన మెండే సతిష్ (30) హత్య కేసు ను పోలీస్ లు ఛేదించారు. గంభీరావుపేట మండలం లింగన్నపేటలో శుక్రవారం సాయంత్రం మెండే సతిష్ దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్ తరలించారు. సోమవారం ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఆఫీసులో సీఐ శ్రీనివాస్ గౌడ్ నిందితుల వివరాలను వెల్లడించారు.

లింగన్నపేట గ్రామానికి చెందిన మెండే సతీష్ నర్మల పవన్ కుమార్ మరియు భీమయ్య గారి రాజశేఖర్ ముగ్గురు కలిసి సుతారి పనికి వెళ్లేవారు. మృతుడు సతీష్ తన అవసరాల నిమిత్తం భీమయ్య గారి రాజశేఖర్ వద్ద కొంత అప్పు తీసుకున్నాడు. ఈ విషయంలో, పవన్ కుమార్, రాజశేఖర్ లు ఇద్దరు కలిసి ఇన్స్టాగ్రామ్ రీల్స్ చేసే విషయంలో ముగ్గురు మధ్య గొడవలు జరిగేవి. శుక్రవారం సతీష్, పవన్ కుమార్ లు ఇద్దరు దావతు చేసుకుంటుండగా, సతీష్, పవన్ కుమార్ ను,అతని సంబంధికుల గురించి అసభ్యకరంగా మాట్లాడడంతో ఇట్టి విషయాన్ని పవన్ కుమార్ రాజశేఖర్ తో ఫోన్లో చెప్పాడు. సతీష్ ను చంపివేయాలని, వాడిని ఎలాగో చంపుదాం అని అనుకున్నాం కదా, ఇప్పుడు సమయం దొరికింది చంపి వెయ్యమనగానే, పవన్ కుమార్, సతీష్ ను బీరు సీసాతో విచక్షణా రహితంగా తల మెడపై కొట్టడంతో అక్కడికక్కడే కుప్పకూలి మరణించాడు. బీరు సీసా ముక్కలు, హీరో గ్లామర్ బైక్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్టు చేసి, రిమాండ్ కి తరలించినట్లు సిఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి నేరస్తులను పట్టుకున్న గంభీరావుపేట ఎస్సై ప్రేమనందం, ఎల్లారెడ్డిపేట ఎస్సై రమాకాంత్ , పోలీస్ సిబ్బందిని సీఐ శ్రీనివాస్ గౌడ్ అభినందించారు.

# సీఎం సలహాదారును కలిసిన పర్శ హన్మాండ్లు..

**బలగం టీవీ, సిరిసిల్ల**



ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ని బీసీ సంఘం రాష్ట్ర నేత పర్శ హన్మాండ్లు సోమవారం హైదరాబాద్ లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. సిరిసిల్ల నియోజకవర్గంలో పలు అంశాలు,సమస్యలను వేం నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని,సిరిసిల్ల నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మహేందర్ రెడ్డి సహకారం తో సిరిసిల్ల నియోజక వర్గంలో అభివృద్ధి పనులు చేపడుతు,సంక్షేమ పథకాలు అట్టడుగు వర్గాలకు అమలు అయ్యేటట్లు చూడాలని వేం నరేందర్ రెడ్డి సూచించారని పర్శ హన్మాండ్లు తెలిపారు.

# పోచమ్మకు తిరుగు బోనం..

**-అమ్మవారికి వెండి కిరీటం అందజేసిన కార్తిక సత్యం**

**బలగం టీవీ, బోయినిపల్లి**




రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామంలో పోచమ్మ తల్లి నూతన ఆలయంలో ఆదివారం తిరుగు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేముల కార్తిక డాక్టర్ సత్యం దంపతులు వెండి కిరీటం అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం అన్నప్రసాదం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, భక్తులు, మహిళలు ,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# బాధిత కుటుంబానికి పరామర్శ

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన కుంటాల హరీష్ మృతిచెందగా వారి కుటుంబసభ్యులను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం.పరామర్శించారు. ఆర్థిక సహాయం చేసి, కుటుంబాన్ని రెండు రోజులలోగా ప్రభుత్వం తరుపున అన్ని రకాలుగా ఆదుకుంటామని భరోసా ఇచారు. జిల్లా బీ.సీ.సెల్ అధ్యక్షులు కూస రవీందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, తడగొండ మాజీ ఎం.పీ.టీ.సీ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుడి శేఖర్ రెడ్డి, ఎండి బాబు, మెరుపుల మహేష్, మండల కాంగ్రెస్ నాయకులు కట్ట లచ్చయ్య, పిట్టల రమేష్, ఎండి మహమ్మద్, కట్ట బాబు, కేశవరెడ్డి, రఫీ, మూదం శీను, కొండ శంకరయ్య, కాడే భాస్కర్, వినయ్, శంకర్, కల్లేపల్లి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.



# నేటి నుంచి డబ్ల్యూటీసీ 2025-27 మొదలు...

- శ్రీలంక, బంగ్లాదేశ్ టెస్టుతో ప్రారంభం
- ఇంగ్లండ్ సిరీస్‌తో ప్రారంభించనున్న భారత్

**బలగం టీవీ, హైదరాబాద్**

దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య రెండ్రోజుల క్రితమే లార్డ్స్‌లో జరిగిన ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌తో 2023-25 సైకిల్‌కు తెరపడింది. మూడో ఎడిషన్ విజేతగా దక్షిణాఫ్రికా నిలవగా.. ఫైనల్ ముగిసిన మూడు రోజులకే డబ్ల్యూటీసీ కొత్త సైకిల్ (2025-27) మొదలవనున్నది. నేటి నుంచి శ్రీలంక.. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో గాలె వేదికగా జరుగబోయే టెస్టుతో నాలుగో ఎడిషన్ మొదలవనుంది. 9 దేశాలు పాల్గొననున్న ఈ ఎడిషన్‌లో మొత్తం 71 టెస్టులు జరుగనున్నాయి. కొత్త సైకిల్‌లోనూ ఆస్ట్రేలియా అత్యధికంగా 22 టెస్టులు ఆడనుండగా మరో అగ్రశ్రేణి జైట్టైన ఇంగ్లండ్ 21 టెస్టులు ఆడనుంది. వరుసగా రెండుసార్లు రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు.. 18 టెస్టులు ఆడుతుంది. రోహిత్ శర్మ తప్పుకోవడంతో కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమ్‌ఇండియా.. ఈనెల 20 నుంచి ఇంగ్లండ్‌తో మొదలుకాబోయే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌తో డబ్ల్యూటీసీ 2025-27 టైటిల్ వేటను ఆరంభించనుంది. నాలుగో ఎడిషన్‌లో ఒక్కో జట్టు ఆరు సిరీస్‌లు (స్వదేశంలో 3, విదేశాల్లో 3) ఆడనుంది.

గత ఎడిషన్‌తో పోల్చితే ఒక మ్యాచ్ తక్కువగా ఆడనున్న భారత జట్టు.. స్వదేశంలో 9, విదేశాల్లో 9 టెస్టులు ఆడనున్నది. సొంతగడ్డపై వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో తలా రెండు మ్యాచ్‌లు ఆడనుంది. వచ్చే ఏడాది ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. విదేశాల్లో ఇంగ్లండ్‌తో ఐదు.. శ్రీలంక, న్యూజిలాండ్‌తో తలా రెండు టెస్టులు ఆడుతుంది. ఇక మూడో ఎడిషన్ విజేత అయిన దక్షిణాఫ్రికా.. ఈ ఏడాది అక్టోబర్‌లో పాకిస్థాన్‌తో జరుగబోయే టెస్టులతో తమ ప్రయాణాన్ని మొదలుపెట్టనుంది. గత ఎడిషన్‌లో 12 మ్యాచ్‌లే ఆడిన సఫారీలు.. నాలుగో ఎడిషన్‌లో 14 మ్యాచ్‌లు ఆడనున్నారు.

# భారత్ న్యూజిలాండ్ సిరీస్ షెడ్యూల్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**




న్యూజిలాండ్ వచ్చే ఏడాది భారత్ పర్యటనకు రానుంది. ఈ పర్యనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను బీసీసీఐ తాజాగా ప్రకటించింది. ఈ టూర్?లో భారత్- న్యూజిలాండ్ వన్డే, టీ20 సిరీస్‌ల్లో ఆడనుంది. మూడు వన్డేలు, ఐదు టీ20 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. 2026 జనవరి 11న వన్డే సిరీస్ ప్రారంభం కానుండగా, అదే నెల 21 నుంచి 31 వరకు జరగనుంది. మూడు వన్డే మ్యాచ్‌లకు వడోదర, రాజ్‌కోట్, ఇండోర్ స్టేడియాలు వేదిక కానున్నాయి. ఈ మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఇక నాలుగో టీ20 ఆంధ్రప్రదేశ్ విశాఖపట్టణం స్టేడియంలో జరగనుంది. జనవరి 28న వైజాగ్‌లో భారత్- కివీస్ మధ్య నాలుగో టీ20 ఉంటుంది. టీ20 మ్యాచ్‌లు రాత్రి 7 :00 గంటలకు ప్రారంభం అవుతాయి.

# కన్నప్ప చిత్రాన్ని చూసిన రజినీకాంత్..

**.బలగం టీవీ, హైదరాబాద్**



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప చిత్రం జూన్ 27న విడుదల కానున్న విషయం తెలిసిందే. అయితే సూపర్‌స్టార్ రజనీకాంత్ ఇటీవల ఈ చిత్రాన్ని వీక్షించి, టీమ్‌ను అభినందించారు. ఈ విషయాన్ని మంచు విష్ణు సోమవారం తన 'ఎక్స్' ఖాతా ద్వారా పంచుకున్నారు. రజనీకాంత్‌తో కలిసి దిగిన ఫోటోలతో పాటు, ఆ మధురానుభూతిని అభిమానులతో షేర్ చేశారు. "రజనీకాంత్ అంకుల్ నిన్న రాత్రి 'కన్నప్ప' సినిమా చూశారు. సినిమా పూర్తయ్యాక ఆయన నన్ను హత్తుకున్నారు. సినిమా చాలా బాగా నచ్చిందని చెప్పారు. ఒక నటుడిగా ఈ హగ్ కోసం 22 ఏళ్లుగా ఎదురుచూశాను. ఈరోజు నేను ఎంతో సంతోషంగా ఫీల్ అవుతున్నాను. ఆయన నన్ను ఎంకరేజ్ చేసినట్లు అనిపిస్తుంది. కన్నప్ప జూన్ 27న వస్తోంది. ప్రపంచం శివుని మాయాజాలం అనుభూతి పొందేలా చేయడానికి నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అంటూ చెప్పుకొచ్చాడు. ఇక సినిమా తరువాత రజినీకాంత్, మోహన్ బాబు కలిసి కేక్ కట్ చేశారు.

# మహిళల వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల



ICC WOMEN'S CRICKET WORLD CUP INDIA 2025

FIXTURES
30 SEPTEMBER - 2 NOVEMBER 2025

| Date | Team | | Team | Venue |
|---|---|---|---|---|
| 30 SEPTEMBER 2025 | INDIA | V | SRI LANKA | BENGALURU |
| 1 OCTOBER 2025 | AUSTRALIA | V | NEW ZEALAND | INDORE |
| 2 OCTOBER 2025 | BANGLADESH | V | PAKISTAN | COLOMBO |
| 3 OCTOBER 2025 | ENGLAND | V | SOUTH AFRICA | BENGALURU |
| 4 OCTOBER 2025 | AUSTRALIA | V | SRI LANKA | COLOMBO |
| 5 OCTOBER 2025 | INDIA | V | PAKISTAN | COLOMBO |
| 6 OCTOBER 2025 | NEW ZEALAND | V | SOUTH AFRICA | INDORE |
| 7 OCTOBER 2025 | ENGLAND | V | BANGLADESH | GUWAHATI |
| 8 OCTOBER 2025 | AUSTRALIA | V | PAKISTAN | COLOMBO |
| 9 OCTOBER 2025 | INDIA | V | SOUTH AFRICA | VIZAG |
| 10 OCTOBER 2025 | NEW ZEALAND | V | BANGLADESH | VIZAG |
| 11 OCTOBER 2025 | ENGLAND | V | SRI LANKA | GUWAHATI |
| 12 OCTOBER 2025 | INDIA | V | AUSTRALIA | VIZAG |
| 13 OCTOBER 2025 | SOUTH AFRICA | V | BANGLADESH | VIZAG |
| 14 OCTOBER 2025 | NEW ZEALAND | V | SRI LANKA | COLOMBO |
| 15 OCTOBER 2025 | ENGLAND | V | PAKISTAN | COLOMBO |
| 16 OCTOBER 2025 | AUSTRALIA | V | BANGLADESH | VIZAG |
| 17 OCTOBER 2025 | SOUTH AFRICA | V | SRI LANKA | COLOMBO |
| 18 OCTOBER 2025 | NEW ZEALAND | V | PAKISTAN | COLOMBO |
| 19 OCTOBER 2025 | INDIA | V | ENGLAND | INDORE |
| 20 OCTOBER 2025 | SRI LANKA | V | BANGLADESH | COLOMBO |
| 21 OCTOBER 2025 | SOUTH AFRICA | V | PAKISTAN | COLOMBO |
| 22 OCTOBER 2025 | AUSTRALIA | V | ENGLAND | INDORE |
| 23 OCTOBER 2025 | INDIA | V | NEW ZEALAND | GUWAHATI |
| 24 OCTOBER 2025 | PAKISTAN | V | SRI LANKA | COLOMBO |
| 25 OCTOBER 2025 | AUSTRALIA | V | SOUTH AFRICA | INDORE |
| 26 OCTOBER 2025 | ENGLAND | V | NEW ZEALAND | GUWAHATI |
| 26 OCTOBER 2025 | INDIA | V | BANGLADESH | BENGALURU |
| 29 OCTOBER 2025 | SEMI-FINAL 1 | | | GUWAHATI/COLOMBO |
| 30 OCTOBER 2025 | SEMI-FINAL 2 | | | BENGALURU |
| 2 NOVEMBER 2025 | FINAL | | | COLOMBO/BENGALURU |

BROADCAST PARTNERS
COMMERCIAL PARTNERS
SOCIAL RESPONSIBILITY

- సెప్టెంబర్ 30 నుంచి మొదలు
- అక్టోబర్ 5న భారత్ పాకిస్థాన్ మ్యాచ్
- నవంబర్ 2న ఫైనల్

**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల క్రికెట్ ప్రపంచ కప్ 2025 షెడ్యూల్‌ను ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ప్రకటించింది. ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 30, 2025 నుంచి నవంబర్ 2, 2025 వరకు భారతదేశం, శ్రీలంకలో జరగనుంది. ఈ 13వ ఎడిషన్‌లో ఎనిమిది జట్లు పాల్గొంటాయి. భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ జట్లు ఉన్నాయి.

భారత్ తమ ప్రపంచ కప్ ప్రయాణాన్ని సెప్టెంబర్ 30న బెంగళూరులో శ్రీలంకతో మొదలుపెట్టనుంది. అనంతరం భారత మహిళల జట్టు పాకిస్థాన్‌తో అక్టోబర్ 5న తలపడనుంది. ఈ హై వోల్టేజ్ మ్యాచ్ శ్రీలంక రాజధాని కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో జరగనుంది. పహల్గామ్ ఉగ్ర దాడి, ఆపై భారత్ వైమానిక దాడుల నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఇది తొలి క్రికెట్ మ్యాచ్ కావడంతో ఈ పోరు కీలకంగా మారింది.

ఇక పాకిస్థాన్ జట్టుకు న్యూట్రల్ వేదికగా కొలంబోను ఐసీసీ కేటాయించింది. అక్కడ మొత్తం 11 లీగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఇందులో శ్రీలంక జట్టు నాలుగు హోం మ్యాచ్‌లు ఆడనుంది. కొలంబోలో జరగాల్సిన మ్యాచ్‌లలో సెమీ ఫైనల్ (అక్టోబర్ 29), ఫైనల్ (నవంబర్ 2) కూడా ఉన్నాయి. అయితే పాకిస్థాన్ నాకౌట్‌కు అర్హత సాధించినట్లయితే మాత్రమే అక్కడ జరుగుతాయి. లేకపోతే భారత్ లోనే మ్యాచ్‌లు జరుగనున్నాయి.

ఈ టోర్నమెంట్ రౌండ్-రాబిన్ దశ ముగిశాక టాప్-4 జట్లు సెమీ ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. సెమీ ఫైనల్స్ లో మొదటి స్థానంలో ఉన్న జట్టు నాల్గవ స్థానంలోని జట్టుతో, రెండో స్థానంలో ఉన్న జట్టు మూడో స్థానంలో ఉన్న జట్టుతో తలపడుతుంది. సెమీ ఫైనల్స్ తర్వాత నవంబర్ 2న గ్రాండ్ ఫినాలే జరుగుతుంది.

భారత్ లీగ్ మ్యాచ్‌ల షెడ్యూల్

సెప్టెంబర్ 30: భారత్ వర్సెస్ శ్రీలంక - బెంగళూరు

అక్టోబర్ 5: భారత్ వర్సెస్ పాకిస్థాన్ - కొలంబో

అక్టోబర్ 9: భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా - విశాఖపట్నం

అక్టోబర్ 12: భారత్ వర్సెస్ ఆస్ట్రేలియా -విశాఖపట్నం


అక్టోబర్ 19: భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ - ఇండోర్


అక్టోబర్ 23: భారత్ వర్సెస్ న్యూజిలాండ్ - గౌహతి

అక్టోబర్ 26: భారత్ వర్సెస్ బంగ్లాదేశ్ - బెంగళూరు

# ది రాజా సాబ్ టీజర్ విడుదల..

**.బలగం టీవీ, హైదరాబాద్**






రెబల్ స్టార్ ప్రభాస్ మారుతి దర్శకత్వంలో ది రాజా సాబ్ చిత్రం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిధి కుమార్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. దాదాపు చిత్ర షూటింగ్ పూర్తైనట్టు తెలుస్తుండగా, ఈ మూవీని డిసెంబర్ 5, 2025న విడుదల చేయనున్నట్టు కొద్ది రోజుల క్రితం ప్రకటించారు మేకర్స్ . ఇక తాజాగా టీజర్ విడుదల చేశారు. ఇది ఫ్యాన్స్ అంచనాలని రెట్టింపు చేసింది. 148 సెకన్ల నిడివి ఉన్న ఈ రాజా సాబ్ టీజర్‌కు ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. వీఎఫ్ఎక్స్ బాగుంది. ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం ఐదు భాషల్లో వరల్డ్ వైడ్ గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా భారీ హవేలీ సెట్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. 41,256 స్క్వేర్ ఫీట్ విస్తీర్ణంతో ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ రాజీవన్ నంబియార్ ఈ రికార్డ్ స్థాయి హవేలీ సెట్ ను నిర్మించారట.. భారతీయ సినిమా చరిత్రలో మరే హారర్ మూవీకి ఇంత భారీ సెట్ నిర్మించలేదు.

హైదరాబాద్‌లో నిర్వహించిన టీజర్ లాంచ్ వేడుకలో చిత్ర యూనిట్ పాల్గొంది. ఈ సందర్భంగా డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ.. ' ఒకరోజు యూవీ క్రియేషన్స్ వంశీ వచ్చి ప్రభాస్‌తో సినిమా చేస్తావా అని అడిగితే షాకయ్యా. రేపు ప్రభాస్ ముంబయి రమ్మన్నాడు అని చెబితే వెళ్లాను. ప్రభాస్‌ని చూడటమంటే దేవుణ్ణి చూసినట్లు ఉంటుంది. ఆ ఎగ్జైట్‌మెంట్ అలాంటిది. నేను తీసిన ప్రేమకథా చిత్రం, భలే భలే మగాడివోయ్ చిత్రాలకు ప్రభాస్ పిచ్చ ఫ్యాన్. నాకు అలాంటి సినిమాల చేయాలని ఉందన్నారు."పక్కా కమర్షియల్' సినిమా సరిగా ఆడకపోవడంతో ప్రొడ్యూసర్ వెనక్కి వెళ్లిపోయారు. ఈ టైమ్‌లో ప్రభాస్‌తో సినిమా అంటే కష్టమని ఫోన్ చేసి చెప్పేద్దామనుకుంటే.. ఆ రోజు సాయంత్రమే ప్రభాస్ ఫోన్ చేసి చాలా విషయాలు మాట్లాడారు. నన్ను ఇంతలా నమ్ముతున్నాడు కాబట్టి కచ్చితంగా ఆయనతో సినిమా తీయాలని నిర్ణయించుకున్నా. ఆ తర్వాత కథలో చాలా మార్పులు చేసి ప్రభాస్‌కి వినిపిస్తే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశాడు. అలా తెరకెక్కించిందే 'ది రాజా సాబ్'. ప్రభాస్ యాక్షన్ హీరో, ఈ కథేమో కామెడీ హారర్. మరి ప్రభాస్ కామెడీ ఎలా చేస్తాడో అని చాలామందికి డౌట్స్ ఉండేవి. మా ఇంట్లో వాళ్లు కూడా అదే అడిగారు. ఒంటరిగా కూర్చుని ఎందుకు రాయలేం అని అనుకుని కసిగా ఈ కథని రాశాను.' అన్నారు.